ప్రజాశక్తి

సోమవారం 18 ఆగస్టు 2025 5 అనంతపురం

జెండా ఆవిష్కరణలో నాయకులు

బిజెపి భావజాలాన్ని అడ్డుకుందాం

తూర్పు,పశ్చిమగోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ గోపీమూర్తి

ప్రజాశక్తి - ఉరవకొండ

విద్యారంగాన్ని కాపాడుకొని ప్రభుత్వ బడులు నిలబెట్టుకోవడంతోపాటు చరిత్రను మార్చి పాఠ్యపుస్తకాలు ముద్రిస్తున్న బీజేపీ మతతత్వ భావజాలాన్ని అడ్డుకుందామని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ గోపీమూర్తి పేర్కొన్నారు.ఆదివారం ఉరవకొండ జోన్ యుటిఎఫ్ నూతన భవన ప్రారంభోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్సీ గోపీమూర్తి, పూర్వ ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, గేయానంద్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను గోపీమూర్తి, ఎస్‌టిఎఫ్ఐ జెండాను గేయానంద్, యుటిఎఫ్ జెండాను షాషావలి ఆవిష్కరించారు. అనంతరం నూతన యుటిఎఫ్ భవనాన్ని ప్రారంభించారు. అంతకు మునుపు భారీ ర్యాలీ నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్ప చౌదరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ గోపి మూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మతతత్వ పోకడలను అనుసరిస్తూ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయడానికి పూనుకుందన్నారు. విద్యా వ్యవస్థ నిర్వీర్యమైతే ఉద్యోగ వ్యవస్థ కూడా పాడవుతుందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వము అనుసరిస్తున్న విధానాలతో 9 రకాల పాఠశాలలతో భవిష్యత్తులో ప్రభుత్వ విద్య కనుమరుగయ్యే పరిస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థి విద్యా కేంద్ర విధానం కాకుండా ఆఫీసర్ సెంటర్ విద్యా విధానం ఉందన్నారు. చదువు చెప్పకుండా ఉపాధ్యాయుల చేతికి సంకెళ్లు వేశారన్నారు. సామాజిక స్పృహ రాజ్యాంగ ఆదేశ సూత్రాల్లో ఉందేకాని పాలకుల ఆచరణలో లేదన్నారు.ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో డబ్బులు ఇచ్చి ప్రైవేట్ రంగం వైపు తరలి పోయే విధంగా చేస్తోందని విమర్శించారు. బలిపీఠం ఎక్కబోతున్న పాఠశాలలను రక్షించుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు.ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతూ ప్రభుత్వ బడిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పూర్వ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొంతమంది గురువులు పుస్తకాలలో ఉన్న వాటిని విద్యార్థులకు నేర్పు తున్నారే కానీ సమాజం గురించి, శ్రమ,విలువలు గూర్చి తెలపడం లేదన్నారు. బడి ప్రజాస్వామ్య బద్ధంగా ఉన్న వ్యక్తిని తయారు చేయాలన్నారు. ప్రస్తుత విద్యారంగంలో కేంద్ర ప్రభుత్వం తమ భావజాలంతో నింపేస్తూ చరిత్రను వక్రీకరించి చరిత్ర మార్చి పాఠ్యపుస్తకాలు తెస్తోందని ఇది సరైన విధానం కాదని అన్నారు. వామపక్ష ప్రజాతంత్ర పోరాటాల ద్వారా సాధించుకున్న వన్నీ బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ఒక్కొక్కటిగా పోగొట్టుకుంటున్నామని, రేపటి తరానికి బిజెపి విధానాలు తీవ్ర నష్టాన్ని చేకూర్చే విధంగా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ రంగం సంస్థలు ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయన్నారు. ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, విద్యుత్ రంగం తదితర రంగాలు అందుకు నిదర్శనాలన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ప్రాథమిక విద్య వ్యవస్థను ప్రపంచ బ్యాంకు ప్రయోగశాలగా మార్చేశారన్నారు. యూటీఎఫ్ కార్యకర్తలు ప్రపంచ దృక్పథాన్ని అర్థం చేసుకొని మన సమాజాన్ని చైతన్యవంతం చేసేలా ఉండాలని సూచించారు. పూర్వ ఎమ్మెల్సీ గేయానంద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం తర్వాత ఉరవకొండ జోన్ లో ఉన్న యుటిఎఫ్ నాయకుల పోరాట స్ఫూర్తి,త్యాగము ఎనలేనిదన్నారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జయ చంద్రారెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య,జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, మహిళా కళాశాల ప్రిన్సిపల్ షాషావలి, మండల విద్యాశాఖ అధికారులు తిమ్మప్ప, వీరన్న, జిల్లా నాయకులు రాఘవేంద్ర, సంజీవ కుమార్, శేఖర్, రాజశేఖర్, దేవేంద్రమ్మ, సరళ, ప్రమీల, చంద్రశేఖర్, ఈశ్వరయ్య, వెంకటరామిరెడ్డి, రవికుమార్,హనుమంతు రెడ్డి,అర్జున్, మండల నాయకులు లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, రఘు, శ్రీనివాసులు, ఉమాపతి, పావన, మురళి, జయరాములు, బండయ్య, నాగరాజు, శ్రీనివాస గుప్తా, మోడల్ స్కూల్ కన్వీనర్ వెంకటేశులు, ఇస్లాం భాష, శ్రీధర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై అఘాయిత్యాలకు అడ్డుకట్ట లేదా..?

- రాజకీయ ఒత్తిళ్లతో పోలీస్‌శాఖ నిర్లక్ష్య ధోరణి
- వేధింపులు, హింసలు, అవమానాలతో నరకయాతన
- గర్భిణి శ్రావణి ఆత్మహత్య ఘటనతో జిల్లాలో కలకలం
- ఏడుగుర్రాలపల్లి, చిన్మయి సంఘటనలు మరువకనే మరిన్ని...
- బెదిరింపులు, రాజకీయ ఒత్తిళ్లతో నీరుగారుతున్న కేసులు

జిల్లాలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేసేవారే లేకుండాపోయారు. దీంతో మహిళలపై జరుగుతున్న నేరాలు నిత్యం వెలుగుచూస్తు ఉన్నాయి. ఒంటరి మహిళ పట్ల సహాయం పేరుతో వేధిస్తున్న ఘటనలు, పొలాలు, గట్ల వద్ద దళిత, గిరిజన మహిళలకు ఎదురైన వేధింపులు, పోలీసుల నుంచి బూతుపురాణాలు ఇవన్నీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. వేదికలపై మహిళల పట్ల నీతిమాటలు చెప్పే నాయకులే లోలోన కేసుల విషయంలో బెదిరించడం, వాటిని నీరుగార్చేలా పోలీసులపై ఒత్తిడి తీసుకురావడం లాంటి సంఘటనలు తీవ్ర విమర్శలకు దారితీస్తున్నాయి. ఇలాంటి సంఘటనలతో రాజకీయ నాయకులు, పోలీసుల్లో ఎలాంటి భావనలు ఉన్నాయో కానీ... ఆయా బాధిత మహిళలు, కుటుంబాలు మాత్రం నరకయాతన అనుభవిస్తున్నాయి. ఇవన్నీ ప్రత్యక్షంగా కనిపిస్తున్నా పోలీస్ శాఖ ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరించకపోవడంతో మహిళల పై అఘాయిత్యాలకు పాల్పడే వారికి కనీస భయం కూడా లేకుండా పోతోంది. ఇందులో భాగస్వాములవుతున్న రాజకీయ నాయకులు, పోలీసులు ఆయా శాఖలకు మాయని మచ్చ తెస్తున్నాయనడంలో సందేహంలేదు.

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని 15ఏళ్ల అమ్మాయికి జరిగిన దుర్ఘటన, జిల్లా కేంద్రంలోని రామకృష్ణకాలనీలో చిన్మయిని ఘోరంగా చంపిన సంఘటన మరువకముందే కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మహిళల పట్ల చోటు చేసుకున్న నేరాలు, ఘోరాలు వెలుగు చూస్తున్నాయి. పట్టణానికి చెందిన నిండు గర్భిణి శ్రావణి అత్తింటివారి వేధింపులు తాళలేక, రాజకీయ నాయకుల ఏకపక్ష మద్దతు, పోలీసులు నిర్లక్ష్యం కారణంగా ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. ఇందుకుగల కారణాలు వాయిస్ రికార్డులలో నమోదు చేయడం కలకలం రేపింది.

మహిళలపై అఘాయిత్యాలు పరిశీలిస్తే ....

ఈనెల 14వ తేదీ రాత్రి అంటే మరో 5గంటలు గడిస్తే దేశంకోసం అందరూ స్వాతంత్ర్య వేడుకలు జరుపుకునే సమయం. అలాంటి రోజు పట్టణానికి చెందిన గర్భిణి శ్రావణి ఆత్మహత్యకు పాల్పడింది. భర్త శ్రీనివాసులు, అత్త కరెమ్మ, మామ శివప్ప చేసిన హింసలు వేధింపులకు గర్భంలో వున్న బిడ్డతో సహ ఈలోకాన్ని వదిలివెళ్లింది. ఇందుకు గల కారణాలను వాయిస్ మెసేజ్‌లో రికార్డు చేసింది. అయినా ఈ కేసును నీరుగార్చేందుకు పోలీసులు, పలువురు రాజకీయ నాయకులు విశ్వయత్నాలు చేశారు. ఆరునెలల క్రితం కళ్యాణదుర్గం మండలం మల్లికార్జునపల్లికి చెందిన శాంతికుమార్‌ను నిత్యం పోలీసులు స్టేషన్‌కు పిలిపించి వేధిస్తుంటే ఆ అవమానాన్ని భరించలేని భార్య గొల్ల మమత, తన బిడ్డ చిన్నారిని నీటితొట్టెలో ముంచి చనిపోయాక తాను సైతం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బ్రహ్మసముద్రం మండల కేంద్రంలో ఒంటరి మహిళను టీడీపీ కార్యకర్త సహాయం పేరుతో డబ్బులు కావాలని, చెప్పినట్లు వింటే నీకు అన్ని పనులు జరిగిపోతాయంటూ వేధించిన సంఘటన వెలుగుచూసినా అక్కడి పోలీసులు అంతంతమాత్రంగానే పరిగణలోకి తీసుకున్నారు. అదే బ్రహ్మసముద్రం మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన దళిత మహిళ వేరుశెనగ పొలాన్ని, అదే గ్రామంలో బీసీ వర్గానికి చెందిన వ్యక్తి పశువులు మేసి ధ్వంసం చేశాయి. ఈవిషయంలో సదరు మహిళ నిలదీస్తే టీడీపీ కార్యకర్త నానా దుర్భాషలాడారు. పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించగా తప్పుడు కేసులు బనాయిస్తున్నారంటూ ఎస్ఐ నారేంద్రకుమార్ బెదిరింపులకు దిగారు. ఆమెకు సహాయంగా వెళ్లిన మరొకరిపై చిందులు వేస్తూ దబాయించారు. అదే మండలంలోని మరో గ్రామంలో ఎస్టీ వర్గానికి చెందిన వ్యక్తి పొలం గట్టువిషయమై తగాదా పడగా ఈవిషయంలో అతని వ్యతిరేక వర్గీయులు కులంపేరుతో దుషించి తలపై దాడిచేశారు. అడ్డుకోబోయిన ఆయన భార్యను నానాదుర్భాషలాడారు. కేసు విషయంలో నాన్చుడు ధోరణి ప్రదర్శించగా భార్య,భర్త స్టేషన్ ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. మహిళపేరుతో ఫిర్యాదు వద్దని భర్తపేరుతో ఫిర్యాదు తీసుకుని కేసును తుస్సుమనిపించారు. కుందుర్పి మండలంలోని ఓ గ్రామంలో ఎన్టీఆర్ బర్త్‌డే సందర్భంగా ఎన్టీఆర్ అక్షరాలకు నల్లకాటన్ ఏర్పాటు చేసి పెట్రోల్‌తో వాటిని ఒకడు ఎన్ అక్షరం వద్ద అంటించగా పెట్రోల్ పోస్తున్నవాడు చివరిలో ఆర్ అక్షరం వద్దకు మంటలు వ్యాపించగా చేతిలోవున్న పెట్రోల్ బాటిల్‌ను విసిరి వేశాడు. సమీపంలో ఉన్న ఓ చిన్నారిపై పెట్రోల్ బాటిల్ పడి మంటలకు గాయాలయ్యాయి. ఈసంఘటనను కూడా తొక్కిపెట్టారు. అదేమండలంలోని జంబుగుంపల గ్రామంలో మూడేళ్ల బాలికపై అత్యాచార సంఘటన జరగగా బాధ్యుడిపై ఫోక్సోకేసు నమోదు చేశారు. కళ్యాణదుర్గం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ఓ గర్భిణి మొహరం పండుగ కోసం తన పుట్టినిల్లు అయిన శెట్టూరు మండలం చిన్నంపల్లికి వెళ్లింది. అంతకుముందు వారం రోజుల క్రితమే అక్కడ పుట్టిన వారు ,పక్కింటి వారు చిన్న గొడవపడ్డారు., ఈ విషయంలో శెట్టూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు చేసుకున్నారు. కాగా పుట్టిన వారు పక్కింటి వారితో గొడవ పడిన సమయంలో పుట్టింటిలో లేని గర్భిణిపై కౌంటర్ కేసు నమోదు చేయడానికి ఆ మండల ఎస్ఐ ఒత్తిడి చేసిన సంఘటన వివాదానికి దారి తీసింది. ఇవి వెలుగులోకి వచ్చిన సంఘటనలు కొన్ని మాత్రమే. లోలోన నాయకుల బెదిరింపులు, పోలీసులు నాన్చుడుతో ఎన్నెన్నే నీరుగారిపోయాయని బాధిత కుటుంబాలు వాపోతున్నాయి.

మహిళలకు న్యాయంచేస్తారనే నమ్మకం లేదు

ప్రస్తుత ప్రభుత్వంలో మహిళలపట్ల జరుగుతున్న నేరాలు, ఘోరాలను రాజకీయనాయకులు, పోలీసులు అధికార దర్పంతో అణిచిపెడుతున్నారు. బాధితులకు న్యాయం జరుగుతుందనే నమ్మకం లేకుండాపోయింది. బాధిత మహిళలు ధైర్యంగా సమస్యను చెప్పుకోలేని స్థితికి తీసుకు వస్తున్నారు. నేరంచేసేవాడు రాజకీయ నాయకుని పంచన వుంటాడు. ఫిర్యాదు చేసినా పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పైగా రాజకీయ నాయకులకు సమాచారమిచ్చి ఇళ్లకు వెళ్లి బెదిరించేలా పురిగొలుపుతున్నారు. నిజాలు తెలుస్తాయి కాని న్యాయం మాత్రం జరగదు. ఇందులో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా వుంది. పోలీసులు మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టలేకపోతుంటే ఇక న్యాయం కోసం ఎక్కడికి వెళ్లాలి. ఇలాంటి వాటిపై మహిళలు, ప్రజాసంఘాలు స్పందించి ఘోరాలకు పాల్పడేవారిని శిక్షించేదాక పోరాడాలి.

చంద్రిక,

ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి

శాస్త్రీయ విజ్ఞానంతోనే సమాజాభివృద్ధి

జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్-ఘనంగా జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-గుత్తి

ప్రతిఒక్కరూ శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకుంటేనే సమాజ అభివృద్ధి సాధ్యమని జనవిజ్ఞాన వేదిక (జెవివి) రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పద్మావాణి ఉన్నత పాఠశాలలో జెవివి 18వ జిల్లా మహాసభలు నిర్వహించారు. ముందుగా పట్టణంలో జెవివి నాయకులు ప్రదర్శనగా మహాసభల వద్దకు చేరుకున్నారు. అనంతరం జెవివి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఉన్నత పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులు సనాతన ధర్మం పేరుతో ప్రజల్లో మూఢ నమ్మకాలను ప్రేరేపిస్తున్నారన్నారు. సమాజ ప్రగతికి మూఢ నమ్మకాలు అవరోధంగా ఉన్నాయన్నారు. ఈనేపథ్యంలో యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు జెవివి కృషి చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ మూఢ నమ్మకాలను విడనాడాలన్నారు. యువత కూడా పెద్దఎత్తున జెవివిలో చేరి మూఢ నమ్మకాలను విడనాడేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. అనంతరం సభలో జెవివి నాయకులు మ్యాజిక్ ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వెంకటరామిరెడ్డి, జి.సత్యనారాయణ, నాయకులు సాకే భాస్కర్, ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ ఎం.రంగన్న, బికె పద్మావతమ్మ, జి.మురళీధర్, తరిమెల అమర్నాథ్‌రెడ్డి, ఎ.రామాంజనేయులు, డాక్టర్ ఆదిశేషు, సత్యసాయి జిల్లా అధ్యక్షులు డాక్టర్ కంచె లక్ష్మీనారాయణ, నాయకులు ఎస్.మహమ్మద్, జిలాన్, స్థానిక నాయకులు ఎన్.రంగనాథ్, సీతానంద, దేశాయి నాగరాజు, శ్రీధర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్

మరో పోరాటానికి సిద్ధం కండి

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి - సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం

అంగన్వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వంపై మరో పోరాటానికి సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో శకుంతల పాతక్క అధ్యక్షతన జిల్లా అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) 8వ జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జి.ఓబులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎస్ఆర్ఎస్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. అన్ని రాష్ట్రాల్లో కూడా ఎస్ఆర్ఎస్, లబ్ధిదారుల ఫేస్ క్యాప్చర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, గత ప్రభుత్వాల సమయంలో అధికారులు సమక్షంలో ఇచ్చిన మినిట్స్‌ను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని, లబ్ధిదారుల ఫేస్ క్యాప్చర్ రద్దు చేయాలని, కనీస వేతనాలు చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఆయా సమస్యలపై సిఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అంతేగాకుండా పార్లమెంటులో చర్చించి బడ్జెట్ కేటాయింపులు పెంచడంతోపాటు అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. వాటిపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు పెట్టి మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. ముఖ్యంగా కిందిస్థాయిలో అధికారులు ఎంత వత్తిడి చేసినా రాష్ట్ర కేంద్రంలో జాయింట్ మీటింగ్ జరగకుండా ఫోన్లు తీసుకోకూడదని, నాయకత్వాన్ని అధికారులు పిలిస్తే వెళ్లి రాష్ట్ర కేంద్రంలో జాయింట్ మీటింగ్ పెట్టాలని, ఆగస్టు 21 ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, సెంటర్ నిర్వాహణకు టాబ్‌లు ఇవ్వాలని, వేతనాలు పెంచాలనిని కోరుతూ ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వాలని, సిఐటియు అఖిలభారత మహాసభలను ఉద్యమంలో నిర్వహించాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీదేవి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలి

తామంతా ఓట్లు వేస్తేనే గెలిచావ్..
ఎమ్మెల్యే కార్యాలయ ముట్టడిలో జూ.. ఎన్టీఆర్ అభిమానులు
ఉద్రిక్తతల నడుమ అభిమానులకు సర్దిచెప్పిన టిడిపి నేతలు

ఫ్లెక్సీని చింపివేస్తున్న ఎన్టీఆర్ అభిమాని

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఎన్టీఆర్ నటించిన వార్ -2 సినిమాను రిలీజ్ చేయడానికి వీలు లేదంటూ ఎన్టీఆర్‌ను, ఎన్టీఆర్ అభిమాని ధనుంజయ నాయుడుని దూషించిన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తక్షణమే ఎన్టీఆర్‌కు, అభిమానులకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వార్-2 సినిమా రిలీజ్ చేయడానికి వీలు లేదంటూ ఎమ్మెల్యే దగ్గుపాటి ఎన్టీఆర్ అభిమాని ధనుంజయ నాయుడుతో ఫోన్‌లో మాట్లాడినట్లు ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. అదే సందర్భంలో ఎన్టీఆర్‌ను దూషించినట్లు ఆడియోలో స్పష్టమైంది. ఈ వాఖ్యలను ఖండిస్తూ ఎన్టీఆర్ అభిమానులు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే కార్యాలయాన్ని ఆదివారం ముట్టడించారు. 'తామంతా ఓట్లు వేస్తేనే ఎమ్మెల్యేగా గెలిచావ్ దగ్గుపాటి' అంటూ పెద్ద ఎత్తున డౌన్ డౌన్ నినాదాలు చేశారు. తమ హీరో సినిమాను ఆపాలంటావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు సర్దిచెప్పాలని చూసినా అభిమానులు వినలేదు. రోడ్డులో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే ఫెక్సీలను చింపేశారు. దీంతో టిడిపి రాష్ట్ర నాయకులు గంగారాం ఇతరులు ఎన్టీఆర్ అభిమానులకు ఎమ్మెల్యే క్షమాపణలు చెప్పారని వివరించారు. అయితే నాలుగు గోడల మధ్య క్షమాపణలు చెప్పానంటే సరిపోదని ఎన్టీఆర్ అభిమానుల మధ్యకు వచ్చి ఎన్టీఆర్‌కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దీనికి టిడిపి నేత గంగారాం స్పందిస్తూ ఎమ్మెల్యే రాగానే మీడియా ముఖంగా అందరి సమక్షంలో క్షమాపణలు చెబుతారని హామీ ఇచ్చారు. దీంతో అభిమానులు ఆందోళన విరమించారు.

తనపై జరుగుతున్న కుట్రల్లో భాగమే ... దగ్గుపాటి

తనపై గత కొన్ని రోజులుగా జరుగుతున్న కుట్రలో భాగంగానే ప్రస్తుతం వైరల్ అవుతున్న ఆడియో కాల్స్ అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. జూనియర్ ఎన్టీఆర్‌ను దూషిస్తున్నట్టుగా వచ్చిన ఆడియోపై ఎమ్మెల్యే దగ్గుపాటి ఒక వీడియో రిలీజ్ చేశారు. వార్-2 విడుదల సమయంలో తాను ఒక అభిమానితో మాట్లాడినట్లుగా ఆడియో క్రియేట్ చేశారన్నారు. ఇందులో తాను జూనియర్ ఎన్టీఆర్‌ను దూషిస్తున్నట్టుగా చిత్రీకరించారన్నారు. ఈ ఆడియోను స్పష్టంగా వింటే ఎవరికైనా ఇందులో కొందరి కుట్ర దాగి ఉందన్న విషయం తెలుస్తుందన్నారు. వాస్తవంగా తాను మొదటి నుంచి నందమూరి కుటుంబానికి అభిమానినని అన్నారు. అలాంటి వారి గురించి తానెందుకు ఇలా మాట్లాడుతానన్నారు. తనకు టికెట్ వచ్చిన రోజు నుంచి తనపై కుట్రలు చేస్తూనే ఉన్నారన్నారు. గత 15 రోజులుగా ఇవి మరింత తీవ్రం చేశారన్నారు. సినిమా రిలీజ్ అయిన నాలుగైదు రోజుల తర్వాత ఎలా వచ్చాయన్నారు. అందుకే దీనిపై జిల్లా ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశానని.. త్వరలోనే వారు నిజాలు నిగ్గు తేలుస్తారని అన్నారు. తాను ఎన్టీఆర్ పై ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోయినా తనపై జరుగుతున్న కుట్రల్లో ఆయన అభిమానుల మనసు గాయపడిందని అందుకే వారికి క్షమాపణ చెబుతున్నానని తెలిపారు. తాను ఎప్పటికీ నందమూరి, నారా అభిమానినని, వారు కుటుంబాలకు జీవితాంతం విధేయుడిగా ఉంటానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు.

సూక్ష్మ సేద్యం రైతులకు ఉపయోగం

జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి. సుదర్శన్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సూక్ష్మ సేద్యం ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని, బోరు బావుల కింద తక్కువ నీరు, విద్యుత్‌తో ఎక్కువ పంటను సాగు చేసి లాభాలను గడించవచ్చునని శ్రీ సత్యసాయి జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి సుదర్శన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న: బిందు సేద్యం ద్వారా రైతులకు ఎలాంటి లాభాలు ఉన్నాయి ?

జవాబు: డ్రిప్ సిస్టం అనేది మొక్కలకు నీటి సరఫరా చేయడానికి ఉపయోగించే ఒక రకమైన నీటిపారుదల వ్యవస్థ. దీనినే బిందు సేద్యమంటారు. డ్రిప్పు వలన నీరు ఆదా అవ్వడమే కాక పంట విస్తీర్ణం పెరుగుతుంది. ఒక ఎకరా పొలానికి మోటర్ ద్వారా కట్టే నీరు మూడెకరాల పొలానికి డ్రిప్పు ద్వారా అందజేయవచ్చు. దిగుబడి సైతం పెరుగుతుంది. విద్యుత్ ఆదా అవుతుంది. పంటలో కలుపు రాకుండా ఉంటుంది. ఎరువులు వేయడానికి సులభతరంగా ఉంటుంది. వేసిన ఎరువులు వధా కాకుండా మొక్కలకు మాత్రమే అందుతాయి.

ప్ర : రైతులకు సబ్సిడీ ధరతో ఎలాంటి పరికరాలు అందజేస్తున్నారు?

జ: సత్యసాయి జిల్లాలో 14 వేల హెక్టార్లలో డ్రిప్పులు , స్ప్రింకర్లు రైతులకు అందజేశాం. ఎస్సీ, ఎస్టీ రైతులకు కేవలం జీఎస్టీ చెల్లించి నూరు శాతం సబ్సిడీ తో పరికరాలను అందజేశాం. అదేవిధంగా 10 నుండి 12 ఎకరాలు లోపు ఉన్న వారికి 50 శాతం సబ్సిడీతో అందిస్తున్నాం. స్ప్రింక్లర్లు రెండు రకాలుగా 30 పైపులు ఉన్న స్ప్రింక్లర్లు, 50 పైపులు ఉన్న స్ప్రింక్లర్లు ఉన్నాయి. కుటుంబంలో ఎంతమంది సభ్యులు ఉన్న రైతులు షేరింగ్ పద్ధతులు ద్వారా డ్రిప్పు పరికరాలను అందజేస్తాం. రైతుల సమ్మతితో ఐదు ఎకరాలు లోపు ఉన్న వ్యక్తి ఎక్కడున్నా డ్రిప్పు పరికరాలను పొందవచ్చు. తొలుత స్వయంగా రైతే దరఖాస్తు ఫారం నింపి అందజేస్తే పరికరాలను అందిస్తాం.

ప్ర : సత్యసాయి జిల్లాలో ఎంత మంది రైతులకు డ్రిప్పు పరికరాలను అందజేశారు?

జ: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 10970 మంది రైతులకు 12,044.22 హెక్టార్లలో రైతులకు డ్రిప్పు, స్ప్రింక్లర్లు అందజేశాం. కొంతమంది రైతులను ఇటీవల బ్రోకర్ల మోసం చేస్తున్నారు. డ్రిప్, స్ప్రింక్లర్లు అందజేస్తామని బ్రోకర్లు ఇతర కంపెనీలో పేరు చెప్పి మోసం చేస్తున్నారు. వారి మాటలు నమ్మకుండా ప్రభుత్వం సూచించిన కంపెనీ ద్వారా మాత్రమే డ్రిప్పు పరికరాలు కొనుగోలు చేసి అందుకోసం దరఖాస్తు చేసుకుని రైతు వాటా చెల్లించాలి. ప్రాథమిక దర్యాప్తు అనంతరం రైతుకు కావలసిన కంపెనీలనుండి డ్రిప్పు పరికరాలు అందజేస్తాం.

ప్ర : జిల్లాలో అనర్హులకు డ్రిప్ పరికరాలు అందజేశారన్న ఆరోపణల పై మీ అభిప్రాయం.

జ : అనర్హులకు డ్రిప్పు పరికరాలు అందజేయడానికి ఆస్కారం లేదు. రైతు తన పొలాన్ని జియో ట్యాగింగ్ చేస్తాం. ఆ సిస్టం ద్వారా అదే సర్వే నంబర్ లో ఉన్నవారికి మాత్రమే పరికరాలు అందజేస్తాం. ఎవరైనా రైతులు తమ స్ప్రింక్లర్లు ఇతరుల పొలాల్లో వేయించినా లేక విక్రయించినా చర్యలు తీసుకుంటాం. రైతులకు అందజేసిన రేటు కంటే రెండింతలు రేటుతో పెనాల్టీ వేస్తాం. జిల్లాలో గడచిన సంవత్సర కాలంలో డ్రిప్ పరికరాలు అడిగిన ప్రతి రైతుకు అందజేస్తున్నాం. ఇంకా కొత్తగా బోర్లు ,బావులు క్రింద సాగు చేసే రైతులకు అందజేస్తాం. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి .సుదర్శన్

ప్రజాశక్తి www.prajasakti.com

రాష్ట్రపతిని కలిసిన జిల్లా యువకుడు బిసాటి భరత్

రాష్ట్రపతికి మెమొంటో అందజేస్తున్న బిసాటి భరత్

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాకు చెందిన జాతీయ యువజన అవార్డు గ్రహీత, యువకుడు బిసాటి భరత్ ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా 'వన్ నేషన్ వన్ ఎలెక్షన్' భావనపై చర్చించారు. దేశవ్యాప్తంగా ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని వినతిపత్రం సమర్పించారు. 'వన్ నేషన్ వన్ ఎలెక్షన్' అంశంపై ప్రచారం చేయడానికి దేశ యువ ప్రతిభావంతులతో ఏర్పాటు చేసిన 'సంవిధాన్ సపోర్ట్ గ్రూప్'లో బిసాటి భరత్ కీలక సభ్యుడిగా ఉంటున్నారు. సంవిధాన్ సపోర్ట్ గ్రూపు ఉద్యమాన్ని బలపరచేందుకు ఇప్పటి వరకు 320 మందికిపైగా పార్లమెంట్ సభ్యులను కలిశారు. లక్షలాది మంది యువతతో సంతకాల సేకరణ చేపట్టారు. దీనికితోడు ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో ఒక రోజు నిరాహార దీక్ష చేసింది. 2000 మందికిపైగా యువతతో భారత పార్లమెంటు వరకు శాంతియుతంగా నిరసన ర్యాలీ చేపట్టారు. అంతేకాకుండా జాతీయ యువజన పురస్కార గ్రహీతలు, ఎన్ఎస్ఎస్ అవార్డు గ్రహీతల నుంచి 112 మంది సంతకాలు చేసిన అభ్యర్థన పత్రాలను రాష్ట్రపతికి అందించారు. రాష్ట్రపతిని కలిసిన వారిలో బిసాటి భరత్‌తో పాటు జాతీయ యువజన, ఎన్ఎస్ఎస్ అవార్డు గ్రహీతలు శివకుమార్, మధీష్ పారీఖ్, సిమర్దీప్ సియాల్, రోహిత్, పల్లబ్ బిశ్వాస్, నిహారిక, సృష్టి, మంటూ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తపోవనం వెళ్లే దారిని బాగుచేయాలి

సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి

కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తపోవనం వెళ్లే దారి మరమ్మతులు చేయడంతోపాటు రిషిత పబ్లిక్ స్కూల్ దగ్గర బ్రిడ్జి నిర్మించాలని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో నగరంలోని శాంతినగర్ నుంచి తపోవనం వరకూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని తిక్క రంగయ్య స్వామి ఆలయం నుంచి తపోవనం వెళ్లే వరకూ దారిని బాగు చేయాలన్నారు. ముఖ్యంగా రిషిత పబ్లిక్ స్కూల్ దగ్గర ఇరుకుగా, పాడైపోయిన బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జిని నిర్మించి ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడాలన్నారు. నడిమివంక సైడ్ వాల్ నిర్మించాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారంపై ఈనెల 18, 19, 20వ తేదీల్లో రిషిత పబ్లిక్ స్కూల్ దగ్గర ఉన్న బ్రిడ్జి దగ్గర జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు వెంకటనారాయణ, వలీ, రాజు, జీవ, గఫూర్, ఇస్మాయిల్, రాముడు, ముసలప్ప, వీరన్న, రామాంజనేయులు, పాల్ జైకర్, సలీం, సుబహాన్ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ శివన్న సేవలు మరువలేనివి

కామ్రేడ్ శివన్నకు నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

సమసమాజ స్థాపనకు, తాను నమ్మిన సిద్ధాంతం కోసం అహర్నిశలు కష్టపడుతూ తుదిశ్వాస విడిచేంత వరకూ కమ్యూనిస్టు పార్టీలో కొనసాగిన కామ్రేడ్ శివన్న సేవలు మరువలేనివని సిపిఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి కొనియాడారు. ఆదివారం ఉరవకొండలోని సిపిఐ కార్యాలయంలో తాలూకా కార్యదర్శి మల్లికార్జున అధ్యక్షతన శివన్న సంస్మరణ సభ నిర్వహించారు. ఇందులో భాగంగా చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివన్న మరణం భారత కమ్యూనిస్టు పార్టీతోపాటు వారి కుటుంబానికి తీరని లోటని అన్నారు. ముఖ్యంగా ఉరవకొండ నియోజకవర్గంలో పేద, బడుగు, బలహీన వర్గాలు, ప్రజల హక్కులు, రైతాంగ సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. ఆయన మరణం తీరనిలోటు అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శివన్న సోదరుడు బసవరాజు, కుమారుడు పురుషోత్తం, కూతురు నాగవేణి, ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు ధనుంజయ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేశవరెడ్డి, మాజీ కమ్యూనిస్టు నాయకులు రాకెట్ల అశోక్‌కుమార్, రైతుసంఘం నాయకులు వెంకటేశులు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెన్నారాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగార్జున, నాయకులు రమణ, నాగేంద్ర, రసూల్, సుల్తాన్, బండయ్య, తదితరులు పాల్గొన్నారు.

యాడికి కాలువ పరిశీలన

ప్రజాశక్తి-యాడికి

ఇటీవల కురిసిన వర్షాలకు యాడికి కాలువకు నీరు రావడంతో ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఇందులో భాగంగా కాలువకు జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాడికి కాలువకు నీరు రావడంతో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఈ విషయం తెలిసే తన సొంత నిధులతో కాలువలో పూడికతీత పనులు చేయించామన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రిని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆసుపత్రిలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి త్వరగతిన పనులు పూర్తి చేయాలని గుత్తేదారుడిని ఆదేశించారు. ఆసుపత్రిలో పనులు పూర్తయిన తర్వాత పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులకు సూచించారు. పనికిరాని వస్తువులు, కాలం చెల్లిన మందులను ఎప్పటికప్పుడు ఒక గదిలో వేయాలన్నారు. ఆసుపత్రిలో పనులు జరుగుతున్న సమయంలో విలువైన వైద్య పరికరాలు భద్రపరచాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, సింగిల్‌విండో అధ్యక్షులు చలమారెడ్డి, టిడిపి నాయకులు తిరపూరం నీలకంఠ, దడియాల ఆది, తాండ్ర విక్రమ్, బొట్టు నాగశేఖర్, ఆదినారాయణ, కోడూరు నీలకంఠారెడ్డి, పిహెచ్‌సి సిబ్బంది, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపుపై వైసిపి దుష్ప్రచారం తగదు

మాట్లాడుతున్న విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల కార్పొరేషన్ ఛైర్మన్ నారాయణస్వామి

ప్రజాశక్తి-అనంతపురం

వికలాంగుల పింఛన్ల తొలగింపుపై వైసిపి అల్లరిమూకలు దుష్ప్రచారం చేయడం తగదని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల కార్పొరేషన్ ఛైర్మన్ నారాయణస్వామి అన్నారు. ఆదివారం అనంతపురంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి అల్లరిమూకలు వికలాంగుల పింఛన్‌పై లేనిపోని అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో అనర్హులకు పింఛన్లు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులను గుర్తించే పనిలో పడిందన్నారు. దీన్ని జీర్ణించుకోలేని వైసిపి అల్లరిమూకలు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా వాస్తవాలను తెలుసుకోవాలని హితవు పలికారు.

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం

ఆంజనేయ స్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాల్ : మండల పరిధిలోని నేమకల్లులో వెలసిన ఆంజనేయస్వామి రథోత్సవాన్ని ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా స్వామివారి మూలవిరాట్‌ను అలంకరించి 47 ఉన్న రథంపై ఆసీనులు చేసి మేళతాళాలు, బాణాసంచాలతో కొలువుదీర్చారు. అనంతరం విప్ కాలవ శ్రీనివాసులు కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఆంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు భారీగా తరలివచారు. వారందరికీ సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ అధికారి నర్సింహారెడ్డి, అన్నదాన కమిటీ పూజారి తిప్పేస్వామి, సర్పంచ్ పరమేశ్వర తెలిపారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

పౌర సరఫరాల సంస్థ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ

మహాసభలో మాట్లాడుతున్న పౌర సరఫరాల సంస్థ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కార్మికులు, హమాలీల హక్కులను హరించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత చట్టాలను యథావిధిగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల సంస్థ హమాలీ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం హెచ్‌ఎల్‌సి కాలనీలో మెడికల్ రెప్స్ హాల్‌లో పౌర సరఫరాల సంస్థ హమాలీ యూనియన్ 5వ జిల్లా మహాసభలను జిల్లా నాయకులు శుభాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కలిసి కార్మికుల హక్కులను కాలరాస్తూ అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నాయని తెలిపారు. 44 కార్మిక చట్టాలను తొలగించి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం అన్యాయంగా ఉందన్నారు. కార్మికులకు అన్యాయం చేసేలా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే ఉప సంహరించి కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. రాష్ట్ర కూటమి ప్రభుత్వం హమాలీలకు, అల్పసంఖ్యాక వర్గానికి ఇబ్బందికరంగా ఉండేలా నగదు బదిలీ పథకాన్ని ప్రవేశపెట్టాలని ఆలోచిస్తోందన్నారు. నగదు బదిలీ పథకం ఆలోచన ఉప సంహరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల సంస్థలో పని చేస్తున్న హమాలీలకు హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ఇఎస్ఐ పథకాన్ని అమలు చేయాలన్నారు. హమాలీలకు ప్రతి నెల 5వ తేదీలోగా వేతనాలు చెల్లించాలన్నారు. హమాలీలకు స్టాక్ పాయింట్ దగ్గర మంచినీరు, టాయిలెట్ సౌకర్యం కల్పించాలన్నారు. దసరా బోనస్, దుస్తులు వెంటనే ఇవ్వాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా హరి, కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా ఈశ్వర్, ఉపాధ్యక్షులుగా అక్కులప్ప, సహాయ కార్యదర్శిగా సురేష్, కమిటీ సభ్యులుగా శంకర్, హనుమంత్ రెడ్డి, చిన్న హనుమంతు, సూరి, రామచంద్ర, గోవిందు, నాగరాజు, విజయ్, గోవిందు, శివను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్, సివిల్ సప్లయ్ హమాలి యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్‌వి.నాయుడు, సిఐటియు జిల్లా కోశాధికారి గోపాల్, ఆఫీస్ ఇన్‌ఛార్జి చంద్ర, 12 స్టాక్ పాయింట్ల హమాలీలు పాల్గొన్నారు.

'ఆచారాలు-సంప్రదాయాలు' పుస్తకావిష్కరణ

'ఆచారాలు-సంప్రదాయాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

రచయిత ఒంటెద్దు రామలింగారెడ్డి రచించిన ఆచారాలు-సంప్రదాయాలు పుస్తకాన్ని అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో జనప్రియ కవి ఏలూరు యంగన్న, ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, వైఎస్ఆర్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీత శాంతి నారాయణ సమక్షంలో ఆదివారం నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక సమీక్ష చేస్తూ జీవశాస్త్ర అధ్యాపకులు జిఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో 'ఆచారాలు, సంప్రదాయాలు' అనేవి అనేక కోణాల్లో మనుషుల జీవితాలను ప్రభావితం చేస్తుంటాయన్నారు. కొన్ని శాస్త్రీయమైనవి, నమ్మదగినవి కాగా మరికొన్ని మూఢనమ్మకాలతో నిండి ఉంటాయన్నారు. వాటిని అందంగా అనుసరించడం కన్నా అవి నిజంగా మన జీవనానికి అవసరమా కాదా అన్న విషయాన్ని తెలుసుకోవడం అవసరమని వివరించారు. అదేవిధంగా "ఒంటెద్దు రామలింగారెడ్డి ఆచారాలు-సంప్రదాయాలు పుస్తకం చదివితే పాఠకులకు ఈ రెండు మధ్య తేడా స్పష్టంగా అవగతమవుతు ఉందన్నారు. నిజజీవితంలో ఏ ఆచారం మంచిది, ఏ సంప్రదాయం శాస్త్రీయమైందో, ఏది మారాలనేదానిపై స్పష్టత కలుగుతుందన్నారు. ఈ పుస్తకం సమాజ మార్పుకు దారితీసే దిశగా ఒక బలమైన ఆయుధంగా ఉపయోగపడుతుందని వ్యాఖ్యానించారు. అనంతరం రచయితను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.ఈశ్వర్‌రెడ్డి, అరసం ప్రధాన కార్యదర్శి తన్నీరు నాగేంద్ర, యోగేశ్వరనాయుడు, తూముచర్ల రాజారామ్, విశ్వనాథ్‌రెడ్డి, అనిత, అరుణకుమారి, కొత్తపల్లి సురేష్, మధుర్‌శ్రీ, ఎస్ఎన్ బాషా, పూజారి ఈరన్న, నర్సిరెడ్డి, వన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

చెస్‌లో చిచ్చర పిడుగులు

'అనంత సోల్జర్స్' ప్రతిభ

చెస్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

ప్రజాశక్తి అనంతపురం సిటీ

లయన్స్ క్లబ్ ఆఫ్ బళ్లారి వారి ఆధ్వర్యంలో ఆదివారం కర్ణాటకలోని బళ్లారిలో నిర్వహించిన చిల్డ్రన్స్ చెస్ టోర్నమెంట్-2025లో అనంతపురంలోని ఎ1 చెస్ అకాడమీ క్రీడాకారులు వివిధ కేటగిరీలో రాణించారు. వివిధ ప్రాంతాల నుంచి 181 మంది క్రీడాకారుల పాల్గొనగా స్విస్ లీగ్ పద్ధతిలో 6 రౌండ్ల పోటీలు నిర్వహించారు. అండర్-16 ఓపెన్ విభాగంలో జొన్నగడ్డల నితీష్ 5.5 పాయింట్లతో రిన్నరప్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. త్రిపద యు 4 పాయింట్లతో 6వ స్థానం, దర్శన్ నీలయ్య 4 పాయింట్లతో 8వ స్థానాన్ని సాధించి ట్రోఫీలు అందుకున్నారు. అండర్-9 ఓపెన్ విభాగంలో నిహాల్ నయనంజన్ ఎస్ 5 పాయింట్లతో రన్నరప్, హర్షవర్ధన్‌రెడ్డి 4 .5 పాయింట్లతో 8వ స్థానం సాధించి ట్రోఫీలు అందుకున్నారు. అండర్-8 విభాగంలో అన్విత్ ఇ 4 పాయింట్లతో ప్రథమ స్థానం, అండర్ 11 విభాగంలో జ్యోతింద్రరెడ్డి ప్రథమ స్థానం, అండర్-14 విభాగంలో హర్ష ఇవిఎస్ఎస్ 3వ స్థానం సాధించారు. అలాగే యంగెస్ట్ క్రీడాకారులుగా శ్రీనిక్ రక్షన్, శ్రీధృవేంద్ర ఉమా పతకాలు సాధించారు.

కంటిచూపు లేకుంటే జీవితం అంధకారమే

డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు



రోగులకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మన్సీ

ప్రజాశక్తి-పామిడి

కంటిచూపు లేకుంటే ఎవరికైనా జీవితం అంధకారమే అని లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక భావసార క్షత్రియ కళ్యాణ మండపంలో శంకర కంటి ఆసుపత్రి బెంగళూరు ఆధ్వర్యంలో ఉంచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ మన్సీ 120 మందికి పరీక్షించారు. వీరిలో 48 మందిని ఆపరేషన్లకు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్, సూక్ష్మక్రిముల నుంచి కళ్లను రక్షించుకోవాలన్నారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రఘువీర్ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పామిడి అధ్యక్షుడు రఘువీర్‌రావు, ప్రధాన కార్యదర్శి పత్రా శ్రీనివాసులు, జిల్లా ఛైర్మన్‌లు మురళీకృష్ణ, జయరామ్‌రావు, లయన్స్ క్లబ్ మెంబర్‌షిప్ ఛైర్‌పర్సన్ డాక్టర్ శాంతిప్రియ, సహ కార్యదర్శి ముండే షేక్షావలి, కోశాధికారి షేక్షావలి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పత్రా నరేష్‌కుమార్, శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజింగ్ మేనేజర్ రాకేష్, శంకర కంటి ఆసుపత్రి, లక్ష్మీ ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

నూతన కమిటీ సభ్యులతో యూనియన్ రాష్ట్ర, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గంటౌన్

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్చుత్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహం వద్ద కళ్యాణదుర్గం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా దుర్గమ్మ, కార్యదర్శిగా వన్నూర్‌స్వామి, కోశాధికారిగా రామాంజినేయులు, ఉపాధ్యక్షులుగా తిమ్మప్ప, రమణ, సహాయ కార్యదర్శులుగా నటరాజ్, శివకుమార్‌తో పాటు మరో ఆరుమందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి నూతన కమిటీ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు అలివేలమ్మ, యల్లక్క, సరస్వతి, ప్రకాష్, జె.వన్నూరుస్వామి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈనెల 18వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిఆర్ఒ మలోల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్‌ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్‌మెంట్‌ను వాట్సప్‌లో పంపిస్తున్నామన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

విశ్రాంత ఉద్యోగ సంఘం సంక్షేమం కోసం కళ్యాణదుర్గం మండలం పాపంపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్న వరదరాజులు రూ. 5వేలు ఆర్థికసాయం అందించారు. ఈమేరకు ఆదివారం స్థానిక పెన్షనర్ల భవనంలో విశ్రాంతి ఉద్యోగులు సంఘం ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి, పాండురంగ, హంపన్న, భగవాన్‌దాస్, కృష్ణమూర్తి, చెనప్ప, ఇస్మాయిల్‌కు నగదు అందించారు.

ఆర్థికసాయం అందజేస్తున్న హెచ్‌ఎం వరదరాజులు

ఆధునిక వైద్య సేవలకు కేరాఫ్ 'సిద్ధార్థ్ దివ్యాన్స్' ఆసుపత్రి

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలోని గుత్తి రోడ్డులో నూతనంగా నిర్మించిన సిద్ధార్థ్ ఆసుపత్రి, దివ్యాన్స్ ఆయుర్వేద ఆసుపత్రి ఆధునిక వైద్యసేవలకు కేరాఫ్‌గా నిలిచిందని ఆసుపత్రి అధినేత డాక్టర్ శంకర్‌నారాయణ, డాక్టర్ ఎండ్లూరు హిమజ తెలిపారు. ఆగస్టు 15న అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్ ఆసుపత్రినిలాంచనంగా ప్రారంభించినట్లు తెలిపారు. బస్టాండ్ నుంచి గుత్తి రోడ్డులో రాజహంస గెస్ట్‌హౌస్ దివాకర్‌రెడ్డి బస్సుల డిపోకు సమీపంలో ఆసుపత్రి ఏర్పాటు చేసినట్లు వివరించారు. పీడియాట్రిక్ విభాగంలో ఆధునిక, మెరుగైన సౌకర్యాలతో ప్రజలకు సేవలు అందించేందుకు సిద్ధార్థ్ ఆసుపత్రిని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలు తమపై చూస్తున్న ఆదరణతో మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు దివ్యాన్స్ ఆయుర్వేద హాస్పిటల్ ద్వారా పూర్తిస్థాయి ఆయుర్వేదిక్ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఇదే క్రమంలో ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో ఇన్‌పేషెంట్, ల్యాబ్, మెడికల్ స్టోర్, ఓటి, ఎన్ఐసియు వంటి ఆధునిక సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుంతకల్లులో సినీ నటి అనసూయ సందడి

అనసూయకు బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

గుంతకల్లు : పట్టణంలో సినీనటి అనసూయ సందడి చేశారు. ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ఆమె గుంతకల్లుకు విచ్చేశారు. ఈమేరకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామితో కలిసి షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. తర్వాత జ్యోతి ప్రజ్వలన చేశారు. అనసూయను చూడటానికి యువకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో ఆ రోడ్డులో పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి ట్రాఫిక్ కు ఎలాంటి అంతరాయం లేకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

టిడిపి నాయకుడి మృతికి నివాళి

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రామలింగారెడ్డి

బుక్కరాయసముద్రం : అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని సిద్ధరాంపురం గ్రామానికి చెందిన టిడిపి ఎంపిటిసి సాకే నాగలక్ష్మి భర్త నాగేంద్రకు టిడిపి నాయకులు ఆదివారం నివాళు లర్పించారు. నాగేంద్ర మృతి విషయం తెలుసుకున్న ఎడిసిపి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాటప్పగారి రామలింగారెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. నివాళులర్పించిన వారిలో టిడిపి మండల కన్వీనర్ అశోక్‌కుమార్, మాజీ సర్పంచు లక్ష్మీనారాయణ, ఎస్.నారాయణస్వామి, సింగిల్‌విండో అధ్యక్షులు కేశన్న, సిద్దారంపురం సాగునీటి సంఘం అధ్యక్షులు కలుగురి పెద్ద శివయ్య పాల్గొన్నారు.

1100 సేవలను వినియోగించుకోండి : డిఆర్ఓ

అనంతపురం కలెక్టరేట్ : మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డిఆర్ఒ ఎ.మలోల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఎపి డాట్ జిఒవిడాట్ ఇన్) వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు రాజకీయ నాయకులతో సమావేశం

రాయదుర్గం రూరల్ : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం విఆర్ఒ రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ నాగరాజు, కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వేలంపాట

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మెచ్చిరి గ్రామ పంచాయితి పరిధిలోని అనుపకొండలో ఉన్న సీతాఫలం చెట్లలోని ఫలసాయం కోసం 20న ఉదయం రచ్చకట్ట వద్ద వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు గ్రామ పంచాయతీ నిర్ణయించిన రూ.500 ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

నేడు మాస్టర్‌ప్లాన్‌పై అవగాహన

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని సీతారామాంజనేయ కళ్యాణ మండపంలో సోమవారం సాయంత్రం రాయదుర్గానికి సంబంధించిన డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు విప్ కాలవ శ్రీనివాసులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో పుర ప్రజలు డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాలు, సూచనలు, సలహాలు ఇవ్వవచ్చన్నారు.

ఇష్టంతో చదివితేనే విజ్ఞానం

అనంతపురం కలెక్టరేట్ : విద్యార్థులు పుస్త కాలను ఇష్టంతో చదివినప్పుడే విజ్ఞానం లభిస్తుందని జీవితంలో ఉన్నత స్థానాలు అధిరోహిస్తారని తెలుగు సాహిత్య కవి అంకే రామలింగయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయుడు శ్రీరాములు అన్నారు. ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 'ఉయ్ లవ్ రీడింగ్ కార్యక్రమంలో భాగంగా చదువు ఏకాగ్రత' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి, రామాయణం, మహాభారతం, భాగవతం కథలు చెప్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పి.కమ్మన్న, ఉజ్జీనేశ్వరి, బి.ముత్యాలమ్మ, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంతల ఆదాయం రూ.2.67లక్షలు

అనంతపురం : మార్కెట్ యార్డులో ఆదివారం నిర్వహించిన సంతల ద్వారా రూ. 2,67,100 ఆదాయం వచ్చినట్లు మార్కెట్ యార్డు కార్యదర్శి గోవిందు ఒక ప్రకటనలో తెలిపారు. గొర్రెలు, మేకల సంతల ద్వారా రూ. 1,52,100, ఆవులు, గేదెల సంత నుంచి రూ. 1,15,000 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

కార్పొరేషన్ ఛైర్మన్లకు అభినందనలు

స్వప్నను అభినందిస్తున్న వీరశైవులు

నారాయణస్వామికి బొకే అందజేస్తున్న గంగానాయుడు

అనంతపురం : వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ తుల్జాపూర్ స్వప్నకు పలువురు వీరశైవులు ఆదివారం స్వగృహంలో అభినందనలు తెలిపారు. ఇందులో భాగంగా కళ్యాణదుర్గం, గుంతకల్లు నుంచి భారీగా తరలివచ్చిన వీరశైవులు స్వప్నను ఘనంగా సత్కరించారు. అలాగే రాష్ట్ర వికలాంగులు, వయోవృద్ధుల కార్పొరేషన్ ఛైర్మన్ నారాయణస్వామికు అభినందనలు వెలువత్తాయి. ఇందులో భాగంగా అనంతపురం ఆర్అండ్‌బి అతిథి గృహంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొందలేడు గంగానాయుడు కలసి శుభాకాంక్షలు తెలిపారు.